# వచ్చినవాడు అప్పారావు



హాఁ. నాన్నా నీకేం తెలుసునే అప్పారావు సంగతీ అంది ఆ నవ్వు. అప్పారావు ఒక మనిషితో పది నిముషాలసేపు మాటాడి కూడా దమ్మిడీ అప్పు అడక్కుండా వెళ్ళిపోయి యెదటివాణ్ణి చితక్కొట్టేసిన సందర్భాలున్నట్టు చరిత్రలో దాఖలాలున్నాయి. పదినిముషాలూ మాటాడి

కేవలం ఒక్క దమ్మిడీయే అప్పుచ్చుకు అవతలివాణ్ణి చితగ్గొటేసిన రోజులూ ఉన్నాయి. అతను యెప్పుడు యెవర్ని యెంత అడుగుతాడో, యెవరి దగ్గిర యెంత ఎలా పుచ్చుకు చక్కా పోతాడో అతనికే తెలియాలి. అతనికీ తెలియదేమో గూడా. ఆ ఋణలీల మనకి అర్థంగాదు. మనదే ముంది ? మనమంతా నిమిత్తమాత్రులం. కేవలం అప్పిచ్చే క్వాలిఫికేషన్ ఉంటేచాలు. ఒక్కొక్కసారి అదీ లేకపోయినాసరే, ఆ సదుపాయం కూడా అతడే చేసి పెడతాడు నాన్నా ! నీకు తెలుసో తెలీదో గాని ఇండియా గవర్నమెంటువాళ్ళు, ఇంకా చిన్న సర్కార్లవాళ్ళు, రిజర్వు బ్యాంకువాళ్ళు, దేశంమీదా విదేశాలమీదా అప్పులు నొల్లుకోవాలంటే, బ్యాంకీల వాళ్ళు డిబెంచర్లు ఫ్లోట్ చెయ్యాలంటే, ఓం ప్రథమంగా యితన్ని ముందు సలహా అడిగి గాని మరొకపని చెయ్యరట. ఫోర్డు, రాక్ ఫెల్లరు, జేబిటేలరు, సి. డి. దేశ్‌ముఖ్ వీళ్ళంతా కూడా ఇతనికి ఉత్తరాలు రాస్తారుట. రెండో కంటికి తెలియకుండా ఇతని రూముకివచ్చి సలహా చెప్పమని అడిగి విని పోతారుట.

అప్పారావు కొత్తరూపాయి నోటులా ఫెళ ఫెళ లాడుతూ ఉంటాడు. కాలదోషంపట్టిన దస్తావేజులాంటి మాసినగుడ్డలూ, బడిపంతులు గారి చేబదుళ్ళలా చిందర వందరగా ఉండే జుట్టూ, అప్పు తెచ్చిన విచ్చు రూపాయిలా మెరిసే పత్తికాయలాంటి కళ్ళూ, అప్పులివ్వగల వాళ్ళంద రినీ చేపల్లా ఆకర్షించగల యెరలాటి చురుకైన చూపులూ, అతనూ, బాకీల వాళ్ళకి కోపిష్ఠివాడి జవాబులా పొట్టిగా టూకీగా వుంటాడు. మొత్తంమీద అతని మొహం ముప్పావలా అర్థణాలా వుంటుందనీ, అతనికి ఎప్పుడూ అంతే అప్పు ఇచ్చే మిత్రుడు అభివర్ణించాడు.

అప్పారావు అప్పులు చేయడం ఉగ్గుపాలతో పెట్టిన విద్య. అతని పుటకల్లోనే, వాళ్ళనాన్న ఉగ్గు పొరిగింట అప్పుతెచ్చి పట్టించాడుట. ఏడే

ళ్ళొచ్చేసరికి వాళ్ళనాన్న బళ్లోవేస్తూ పలకలూ, యెక్కాలబుక్కులూ పంచి పెట్టబోయేసరికి ఎవరోవచ్చి యెందుకయ్యా ఇంత ఖర్చూ అన్నాడుట.

నేనుంగబగబా బడి చదివేసి పెద్దపోలీసు వాణ్ణయిపోయాకానేమో బోల్డు రూపాయలు అప్పు సంపాయించి అప్పు తీర్చేస్తానుగా అన్నాడు అప్పారావు.

పువ్వు పుట్టగానే పరిమళించింది అని సరసమాడారు అప్పారావు జనకుడు అప్పలస్వామి మిత్రులంతా.

అయితే అందాకా ఈ నా బాకీ తీరదా ఏమిటి అన్నాడు ఆ నాటికి అప్పలస్వామికి అప్పుసర్దినాయన బిక్కమొహం పెట్టి.

అయితే ఇంతకీ వాడు నాయెదుట పడడేం — చెప్పు, అలా ముసి ముసి నవ్వులు నవ్వుకుంటే ఎలా అన్నారు మునసబుగారు. యింత సేపూ ఆయన స్టేజీమీద జనాంతికం డైలాగు చెబుతున్న వాడి పక్క నటుడిలా ఏం చెయ్యడానికీ పాలుపోక చుట్టకాలుస్తూ కూర్చున్నాడు.

గుర్నాధం చిరునవ్వు నవ్వాడు. నాన్నా అప్పారావే గనక నీ ఎదుట పడి అడగడం జరిగితే మనిద్దరం ఇలా మూన్నాళ్ళు యిద్దామా వద్దా అని ఆలోచించడానికి తెరిపే ఉండేదికాదు. అతను సుడిగాలిలా వచ్చిపడి అడుగుతాడు. అతను వెళ్ళిపోయినాకగాని, నువ్వతనికి ఇందాకళ అప్పిచ్చా ననీ, యింత మొత్తం ఇచ్చాననీ నీకు తెలీనే తెలీదు. అంచేత అతను రానందుకు ఆనందించు నాన్నా అంది గుర్నాధం చిర్నవ్వు.

ఎక్కడో అసాధ్యుడల్లే ఉన్నాడే. ఇలాంటివాళ్ళు నీకెలా తటస్థ పడ్డారోయ్ అంది మునసబుగారి పొగ కత్తీ నిట్టూర్పు.